www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | గురువారం 10, సెప్టెంబర్, 2026

## నకిలీ ఎరువులతో
# నయా దందా!



**చర్ల: సెప్టెంబర్ 9 భద్రాద్రి న్యూస్ :** గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న అన్నదాతల నిస్సహాయతను కొందరు ఎరువుల వ్యాపారులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంటల సాగు కీలక దశకు చేరుకోవడంతో ఎరువుల కోసం రైతులు దుకాణాల వద్దకు పరుగులు తీస్తుండగా.. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా కొన్ని ఎరువుల నాణ్యతపై కూడా రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గిరిజన రైతుల నమ్మకమే పెట్టుబడిగా.. కొందరు వ్యాపారుల దోపిడీకి తెర?

అధిక ధరలకు ఎరువుల విక్రయాలపై ఆరోపణలు.. నాణ్యతపై రైతుల్లో అనుమానాలు

బస్తా చేతిలో పెడుతూ.. అన్నదాత జేబుకు చిల్లు!

పంట నష్టపోతే బాధ్యత ఎవరిది? అధికారులు ఆకస్మిక తనిఖీలు ఎక్కడ?

2 లో..




## కలెక్టర్ సారూ ప్రజల ప్రాణాలపై
# ఆర్ఎంపీల అధిక డోసులు..!




2వ పేజిలో...

వైద్య బృందానికి ఆర్ఎంపీ క్లినిక్లలో దర్శనమిచ్చిన మత్తు మందులు..

ఆర్ఎంపీలపై నేటికీ చర్యలు చేపట్టని భద్రాద్రి జిల్లా డీఎంహెచ్వో..

**చంద్రుగొండ/జూలూరుపాడు (భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:**
కలెక్టర్ సారూ చంద్రుగొండ మండలంలోని కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో కొందరి వైద్యం వికటించి చాలా మంది రోగులు పెద్దాసుపత్రుల పాలయ్యారు. ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాల్సిన వీరు అంతకుమించి చేస్తున్నారు. తమ క్లినిక్లలో బెడ్లు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. ఫలితంగా ప్రజలు ఆరోగ్యపరంగా, ఆర్థికంగా నష్టపోతున్నారు. యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించవద్దనే నిబంధన ఉన్నా. కొందరు ఆర్ఎంపీలు ..

## ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని
# ఘనంగా నిర్వహించాలి



6లో



రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్.

**భద్రాద్రి న్యూస్ ములుగు**
ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27వ తేదీన జిల్లాలలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక..

# నకిలీ ఎరువులతో నయా దందా!



**మొదటి పేజీ తరువాయి**

### రైతు చెమటకు వ్యాపారుల దోపిడీ?

రైతు పగలు, రాత్రి కష్టపడి సంపాదించిన సొమ్ము సాగు పెట్టుబడిగా పెడుతుంటే.. ఎరువుల పేరుతో అదనపు భారం మోపుతున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం ఎరువులు విక్రయించాల్సి ఉన్నప్పటికీ, కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బిల్లులు ఇస్తున్నారా? నిర్ణీత ధరలకే విక్రయిస్తున్నారా? స్టాక్ వివరాలు సక్రమంగా నిర్వహిస్తున్నారా? అన్న ప్రశ్నలకు అధికారుల తనిఖీలే సమాధానం చెప్పాల్సి ఉంది.

### బస్తా చేతిలో.. జేబు ఖాళీ!

"ఎరువుల బస్తా చేతిలో పెడుతున్నారు.. కానీ రైతు జేబుకు మాత్రం చిల్లులు పెడుతున్నారు" అన్నట్టుగా పరిస్థితి మారిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, సాగునీటి వ్యయాలతో సతమతమవుతున్న అన్నదాతపై ఎరువుల ధరల భారం మరింత పెరిగితే సాగు పెట్టుబడి భారంగా మారే ప్రమాదం ఉంది.

### నకిలీ అయితే పంట నష్టానికి బాధ్యులెవరు?

ఎరువులు నకిలీవి లేదా నాసిరకమైనవిగా తేలితే వాటి ప్రభావం పంట ఎదుగుదల, దిగుబడిపై పడే అవకాశం ఉంది. రైతు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేసిన తర్వాత దిగుబడి తగ్గితే అతడి పరిస్థితి ఏంటి? నష్టం వస్తే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అందుకే మార్కెట్‌లో విక్రయిస్తున్న ఎరువుల నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఎరువులు విక్రయిస్తున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు ఎక్కడ?

ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. ధరల పట్టిక, స్టాక్ వివరాలు, కొనుగోలు–విక్రయ రికార్డులు, బిల్లుల జారీ, ఎరువుల నాణ్యత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. నిర్ణీత ధరలకు మించి వసూలు చేస్తున్నారా? బిల్లులు ఇవ్వకుండా విక్రయాలు సాగుతున్నాయా? నాసిరకం ఎరువులు మార్కెట్‌లోకి వస్తున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

### అధికారుల నిఘా కరువైందా?

రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన వ్యవస్థలోనే అక్రమాలకు అవకాశం కల్పిస్తే అన్నదాత మరింత నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. రైతుల నుంచి వస్తున్న ఆరోపణలు నిజమైతే సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు అవాస్తవమైతే అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని రైతులు కోరుతున్నారు.

### గిరిజన రైతుల జేబులకు రక్షణ కల్పించాలి!

ఎరువుల విక్రయాల్లో అక్రమాలు, అధిక ధరలు, నకిలీ లేదా నాసిరకం సరుకు విక్రయాలపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కాగితాలపై తనిఖీలు కాకుండా.. క్షేత్రస్థాయిలో ఆకస్మిక దాడులు నిర్వహించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. అన్నదాతను దోచుకునే దందాకు చెక్ పెట్టాలి.. గిరిజన రైతుల ప్రయోజనాలను కాపాడాలి.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# కలెక్టర్ సారూ ప్రజల ప్రాణాలపై ఆర్ఎంపీల అధిక డోసులు..!!

**మొదటి పేజీ తరువాయి**

ఇవేమీ లెక్క చేయడం లేదు. ఇంజక్షన్లు ఇచ్చి. జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో సుమారు 30 మంది ఆర్ఎంపీ, పీఎంపీలు ఉన్నట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. ఇటీవల కొందరి క్లినిక్లపై వైద్య అధికారులు దాడులు నిర్వహిస్తే భయంకరమైన అధిక డోసుల మందులు గుర్తించారు వారిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం వలన మరల ఆర్ఎంపీ లు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారు. జిల్లా వైద్య అధికారులు. తనిఖీలు కొంతకాలం కాకుండా నిత్యం కొనసాగిస్తేనే మేలు అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### – వైద్య శాఖ చర్యలు చేపట్టక పోవడం లో అంతర్యమేమిటి..!

భద్రాద్రి జిల్లా వైద్య అధికారుల ఆదేశాల మేరకు చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం పలు ఆర్ఎంపి ప్రథమ చికిత్స కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మండల కేంద్రంలోని కొందరు ఆర్ఎంపీల క్లినిక్లలో అధిక మోతాదు స్టేరాయిడ్, మత్తు మందులు. అబార్షన్ కిట్లు, ప్రజల ప్రాణాలకు ప్రమాదకర మందులు గుర్తించి అచర్య పోయారు. ఆర్ఎంపీలు వాడుతున్న అధిక డోసుల గురించి సుమారు నెల రోజులు కావస్తున్నా నేటికీ జిల్లా వైద్య శాఖకు సంబంధించిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలపై చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటో అంతు చిక్కడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఆర్ఎంపీ వైద్యులు, జిల్లా వైద్య అధికారుల కనుసన్నులలో వైద్యం నిర్వహిస్తున్నారా? లేకపోతే చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యం డబ్బు బలమా? లేక రాజకీయ బలమా? అన్నది అర్థం కానీ పరిస్థితి నెలకొంది.

### – ఎంబిబీఎస్ వైద్యులుగా మారుతున్న ఆర్ఎంపీలు.

మండలకేంద్రంలోని కొందరు ఆర్ఎంపీలు ఎబిబీఎస్ డాక్టర్ల అవతారమెత్తి హద్దులు మీరుతున్నాయి. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్ఎంపీలు ఎంబిబిఎస్, ఎండీ వైద్యులను మించి చికిత్స అందిస్తున్నారు. మెడిసిన్ చదివిన వారు ఇస్తున్న మందుల గోలీల కంటే కొందరు ఆర్ఎంపీలు ఇస్తున్న యాంటీబయటిక్స్ ఎక్కువ. వీరిపై ప్రజలకు ఉన్న గుడ్డి నమ్మకమే కొన్నిసార్లు రోగుల ప్రాణాల మీదకు తెస్తుంది. జ్వరం వచ్చిన, అనారోగ్యం పాలైన రెండు ఇంజక్షన్లు వేసి అవసరం లేకున్నా సెలైన్లు తోపాటు, యాంటీబయోటిక్స్ అంటగట్టి అందన కాడికి లాగుతున్నారు. కేవలం ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావలసిన ఆర్ఎంపీలు మండలకేంద్రంలోని ప్రధాన రహదారి వెంట నర్సింగ్ హాటరీమ్ తరహాలో బెడ్లు వేసి మరీ వైద్యం చేస్తున్నారు.

# భద్రాచలం లో 18,19 తేదీలలో ఎస్ జి ఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు





**భద్రాద్రి న్యూస్ భద్రాచలం**

స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 70వ మండల స్థాయి తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల భద్రాచలం లో నిర్వహిస్తున్నట్లు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం నాడు స్థానిక మండల వనరుల కేంద్రంలో మండలములోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాల ప్రధానోపాధ్యాయుల మరియు పిటి,పిడిల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18వ తేదీన బాలికలకు, 19వ తేదీన బాలురులకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కాబట్టి మండలములోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని అందరూ ఆటల్లో పాల్గొనాలని మండల విద్యాశాఖ అధికారి పిలుపునిచ్చారు. పాఠశాల గేమ్స్ నిర్వహణకు మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు,కన్వీనర్ గా స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఆర్గనైజర్ PV, రమణ , SNM, ZPHS భద్రాచలం,కో కన్వీనర్స్ గా వీ. రమేష్, ఫిజికల్ డైరెక్టర్ GHS భద్రాచలం, . సుజాత, ఫిజికల్ డైరెక్టర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల భద్రాచలం, కమిటీల కోఆర్డినేటర్ గా రాజా శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా భద్రాచలం మండలంలోని అన్ని పాఠశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ ఉ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్స్ వ్యవహరించనున్నట్లుగా మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి తెలిపారు . ఈ కార్యక్రమంలో లిస్కూల్ కాంప్లెక్స్ ప్రధానఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జాన్సన్, పటేల్ లక్ష్మీనారాయణ , బాలేందర్, లీల, హేమలత, సాయన్న,ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, కిషోర్ సీఆర్పీలు, సిసిహెచ్ఓ మండలంలోని వివిధ పాఠశాలల హైస్కూల్ మరియు ప్రాథమికోన్నత ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# భద్రాచలం అభివృద్ధే లక్ష్యం... ప్రజా సంక్షేమమే ధ్యేయం!

**విద్య – వైద్యం – మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**



**భద్రాచలం, సెప్టెంబర్, 9 (భద్రాద్రి న్యూస్):**

హైదరాబాద్‌లో అసెంబ్లీ సమావేశాల అనంతరం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ గారితో కలిసి భద్రాచలం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించిన భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు. నియోజకవర్గంలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడం, మెరుగైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రజల అవసరాలను గుర్తించి, నియోజకవర్గ ప్రగతిని వేగవంతం చేస్తూ, భద్రాచలం భవిష్యత్తును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజా ప్రతినిధుల సమన్వయంతో నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. భద్రాచలం అభివృద్ధి కోసం... ప్రజల సంక్షేమం కోసం... నిరంతరం ముందడుగు! ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నీరు విడుదల చేయాలని నేరెళ్ల రైతుల ఆవేదన

కమలాపూర్ మండలం నేరెళ్ల గ్రామ రైతులు బుధవారం తమ సాగు, తాగునీటి సమస్యపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తమ వాగుకు ఎస్సారెస్పీ నుండి కాకతీయ కెనాల్ ద్వారా నీరు వచ్చేదని, ప్రస్తుతం నీటి విడుదల నిలిచిపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని, తాగునీటి సమస్య కూడా తలెత్తుతోందని వాపోయారు.అరకొర వర్షాలతో వరి నాట్లు వేసి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు నీరు అందకపోతే పంటలన్నీ ఎండిపోయి అప్పుల పాలవుతామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సారెస్పీ నుండి నీటిని విడుదల చేయాలని, కనీసం ఈ వానాకాలం పంటకైనా 3 నుండి 4 విడతలుగా నీటిని విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# త్రివేణిలో తెలంగాణ పలుకుల పరిమళం

## –యాస, భాష, సంస్కృతిని ప్రతిబింబిస్తూ ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 9( భద్రాద్రి న్యూస్):**

తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివేణి పాఠశాల , ఖమ్మం శాఖలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలంగాణ యాసలో సంభాషణలు, జానపద గీతాలు, నృత్యాలు, సామెతలు, నుడికారాలు, పొడుపుకథలు ప్రదర్శించి అలరించారు. అనంతరం జనకవికి పూలమాలతో అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావును స్మరించుకుని ఆయన సాహిత్య సేవలను కొనియాడారు. పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, భాష ఒక ప్రాంతపు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని, తెలంగాణ ప్రత్యేకతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, పల్లె పలుకుల్లో మన సంస్కృతి, జీవన సౌందర్యం దాగి ఉందని అన్నారు. విద్యార్థులు స్థానిక పదాలు, నుడికారాలు, సామెతలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్‌లో “తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు




**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):-**

స్థానిక శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో ప్రజా కవి, ప్రజాసామ్యవాది, మానవతావాది, పద్మవిభూషణ్ శ్రీ కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని కాళోజిగారి చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించి తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగినది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ, కాళోజి తెలంగాణ ప్రాంత విలువైన సాహిత్యపు ఆస్తి అని పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిదే అన్న కవి అంటూ అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి, అన్యాయాన్ని ఎదిరించినోడే నాకు ఆరాధ్యుడని సూటిగా చెప్పిన మానవతావాది కాళోజి అంటూ నిజాం నిరంకుశ పాలనలో అణిచివేయబడిన తెలంగాణ యాస, భాషలు నేడు పాఠ్యపుస్తకాలలో పాఠ్యంశాలుగా పొందుపరచి మన యాస, భాషలకు అద్భుతమైన గౌరవం తెచ్చుకున్నామని మన ప్రాంత మాండలికాలను, యాసను బావితరాలకు అందించాలని తెలియజేస్తూ అందరికి తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరక్టర్ కొండా కృష్ణవేణి పాల్గొని మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తన జీవితకాలం ఎక్కడ అన్యాయం ఉన్నా, అణచివేయబడుతున్న తాడిత, పీడిత ప్రజల పక్షాన నిలబడి సమాజంలోని సమకాలిన అంశాలను తన కవితలుగా తెలంగాణ యాస, భాషలలో చూపిస్తూ తెలంగాణ భాషా సౌందర్యాన్ని అందరికి అర్థమైయ్యేలాగా సామాజిక చైతన్యాన్ని కలిగించిన ఉద్యమకవి అంటూ వారి సాహిత్య సేవను, పోరాటజీవితాన్ని, ప్రజాహితాన్ని తెలియజేస్తూ అందరికి తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. తెలంగాణ భాషా దినోత్సవ సందర్భంగా స్కూల్‌లో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించి వాటిలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను అందజేసి వారిలో తెలంగాణ భాష పట్ల, తెలంగాణ కవుల పట్ల గౌరవాన్ని, ఆసక్తిని పెంపొందింపజేస్తూ వారిలో ఉత్సహాన్ని నింపుతూ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గోన్నారు.

# బీఆర్ఎస్ లో భారీ చేరికలు






## కారెక్కిన సీపీఐ సీనియర్ నేత కిలారు ప్రసాద్

## పాత కొత్తగూడెం 11వ డివిజన్ నుంచి చేరికలు

**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్, 9 (భద్రాద్రి న్యూస్):-**

కొత్తగూడెం నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీలో బుధవారం భారీ చేరికలు జరిగాయి. ఉమ్మడి సుజాతనగర్ గ్రామపంచాయతీకి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు కిలారు ప్రసాద్ ఆధ్వర్యంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ లోని 11వ డివిజన్ పాత కొత్తగూడెంకు చెందిన సుమారు వంద మంది కార్యకర్తలు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన చేరికల కార్యక్రమంలో వీరంతా గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక పాలన కొనసాగుతొందని, ప్రజలు ఈ పాలనతో విసుగెత్తిపోయారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ తిరిగి కెసిఆర్ పాలన నే కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న 10 ఏళ్లు కెసిఆర్ రైతు పక్షపాతిగా పరిపాలించారు అని అన్నారు. ఆ నమ్మకంతోనే కొత్తగూడెం నియోజకవర్గంలో కూడా ప్రజలందరూ బిఆర్ఎస్ పార్టీ పట్ల విశ్వాసం చూపుతున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన కిలారూ ప్రసాద్ ఆయన అనుచరులకు ఎంపీ రవిచంద్ర శు భాకాంక్షలు తెలిపారు.

చేరికల కార్యక్రమానికి ముందు పాత కొత్తగూడెం 11వ డివిజన్ నుండి కిలారి ప్రసాద్ ఆధ్వర్యంలో 100 మోటార్ సైకిళ్లతో భారీ రాలీగా తెలంగాణ భవన్ కు వచ్చారు. పార్టీలో చేరిన వారు చర్ల వీరయ్య, పడాల భాస్కర్, మేకల వెంకన్న, గౌడ్ వెంకన్న, నాగేంద్ర, అశోక్, నరేష్, సందీప్, రాకేష్, నాగరాజు, అశ్వద్ధామ, సంజయ్ భార్గవ్, శశి, సాయి వంశీ, ఫణి కుమార్, అద్దాల రాము, శ్రీకాంత్, నరసింహ, ఆర్టీసీ రాజు, వంశీ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, సీనియర్ నాయకులు బీమా శ్రీధర్, మేకల నాగబాబు, కార్పొరేటర్లు బత్తుల మధు చంద్, మల్లెల రవిచంద్ర, గుణ చరిత్ముద్దంగుల మహేష్, జూనియర్ రాజేష మాదాసు పద్మ, డీకొండ సునీత, విజయ్, జగన్, సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్, బొమ్మిడి రమాకాంత్, కన్ని, బొమ్మిడి శ్రీకాంత్, సంపు, పూసల విశ్వనాథం, సచిన్, కరాటే శీను, వెంకటేష్, తాండ్ర శీను, తోగర్ రాజశేఖర్, ఆనంద్, డాబా శంకర్, నరకట్ర శేఖర్, ఇర్ఫాన్, సేవియా, పెయింటర్ రాజేష్, భూపతి శీను, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఈ నెల 11న జాబ్ మేళా

## ప్రైవేట్ రంగంలో 25 ఉద్యోగ ఖాళీల భర్తీ

## 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత.. రూ.25 వేల వరకు వేతనం

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):-**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 11వ తేదీన శుక్రవారం ఖమ్మంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి ఎన్. మాధవి తెలిపారు. హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టీటీడీసీలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్లో సెంటర్ మేనేజర్/ERO/LRO--రూరల్ మైక్రో లోన్స్ విభాగంలో 20 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి, 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15,000 వేతనంతో పాటు ఇన్సెంటివ్‌లు అందజేస్తారని తెలిపారు. అదేవిధంగా రిలయన్స్ జియో ఖమ్మం విభాగంలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 5 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉన్న యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.14,000 నుంచి రూ.25,000 వరకు వేతనం అందుతుందని పేర్కొన్నారు.

అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఈ నెల 11న జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి మాధవి సూచించారు. ఇతర వివరాల కోసం 9448241214, 9391539320 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

# దేవాలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్

**జూలూరుపాడు, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):-**



జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దేవాలయ చోరీ కేసును ఛేదించి, సదరు కేసులో ప్రమేయం ఉన్న ఇద్దరు నిందితులను జూలూరుపాడు పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకొని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది. జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలోని దేవాలయంలో జరిగిన హుండీ చోరీకి సంబంధించి నమోదైన కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సాంకేతిక ఆధారాలు మరియు విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిందితుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తేదీ 09.09.2026 న జూలూరుపాడు సాయిబాబా గుడి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారు జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పై దేవాలయ చోరీతో పాటు గతంలో పలు ప్రాంతాల్లోని దేవాలయాల్లో హుండీలను పగులగొట్టి నగదు చోరీలకు పాల్పడినట్లు వెల్లడైంది. నిందితులు రాత్రి సమయంలో జనసంచారం లేని దేవాలయాలను గుర్తించి, ఎవరూ లేని సమయాన్ని గమనించి దేవాలయాల్లోకి ప్రవేశించి హుండీలను పగులగొట్టి అందులోని నగదును చోరీ చేయడం అలవాటుగా చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుల వద్ద నుండి రూ.5,798/- నగదు, అలాగే ూాూవాూ మరియు ఎ×ూా కంపెనీలకు చెందిన రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, అవసరమైన చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయస్థానం వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించడం జరిగింది. నిందితులకు ఇతర ప్రాంతాల్లో జరిగిన దేవాలయ చోరీలతో ఉన్న సంబంధంపై కూడా విచారణ కొనసాగుతోంది. దేవాలయాలు మరియు ప్రార్థనా మందిరాల నిర్వాహకులు భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు జజుం కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జూలూరుపాడు పోలీసులు కోరుతున్నారు.

# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ పోలీసులకు ఫిర్యాదు

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ నాయకులు**

**వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**ఖమ్మం ప్రతినిధి, (భద్రాద్రి న్యూస్):–**
తెలంగాణ రాష్ట్ర సాధకులు, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత లికల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)లిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఖమ్మం జిల్లా 3 టౌన్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజకీయంగా విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే కేసీఆర్ మరణాన్ని కోరుతూ వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా అభ్యంతరకరమని నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు రాజకీయ విలువలను దిగజార్చడమే కాకుండా తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన ఉద్యమాన్ని, తెలంగాణ ప్రజల కోసం ఆయన చేసిన కృషిని మాటలతో చెరిపివేయలేరని అన్నారు. ఈ నేపథ్యంలో వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ 3 టౌన్ సీఐని కలిసి అధికారికంగా ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి రామ్మోహన్, మాటేటి నాగేశ్వరావు, పాలడుగు పాపారావు, కొప్పెర నరసింహారావు, కనకం భద్రయ్య, వద్దే లెనిన్ చౌదరి, బాశెట్టి ఫణికృష్ణ, నన్ని పఠాన్, కొల్లి విద్యాసాగర్, డోన్ వన్ శీను, బాసిపొంగు వెంకటేశ్వరరావు, నగరబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు. రాజకీయ పోరాటం సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై ఉండాలని, వ్యక్తిగత ద్వేషాలకు, మరణాన్ని కోరే వ్యాఖ్యలకు తావు ఉండకూడదని నాయకులు అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఉన్మాదికి ఉరిశిక్ష అమలు చేయాలి

**బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి**

**ఆదివాసి 9 తెగల చైర్మన్ చుశీచు రామకృష్ణ**

**కొత్తగూడెం చేరుకున్న ఆదివాసి సంఘాల పాదయాత్ర**

**రేపు భారీ మహా పాదయాత్ర**

**లక్ష్మీదేవి పల్లి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):**
ఆదివాసి బిడ్డ ఊకే శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఆదివాసి 9 తెగల చైర్మన్ చుశీచు రామకృష్ణ అన్నారు. బుధవారం లక్ష్మీదేవి పల్లి మండలం లక్ష్మీదేవి పల్లి లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...
తెలంగాణలో ఆదివాసి యువతి ఊకే శిరీష పై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై ఆదివాసి సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సింగ్ శిక్షణ పూర్తి చేసి ప్రైమ్ కేర్ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తున్న త్రిషను రాఖీ పౌర్ణమి తెల్లవారుజామున దారుణంగా హత్య చేయడం రాష్ట్రంలోని మహిళల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగించే ఘటనగా పేర్కొన్నారు. ఈ ఘటనపై న్యాయం కోరుతూ ఆదివాసి 9 తెగల జాయింట్ యాక్షన్ కమిటీ, ఆదివాసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా నుంచి ప్రారంభమైన పాదయాత్ర కొత్తగూడెం చేరుకుంది. పాదయాత్రలో విద్యార్థులు, మహిళలు, ఆదివాసి సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా మహిళలకు, ముఖ్యంగా ఆదివాసి మహిళలకు పూర్తి భద్రత కల్పించలేకపోవడం బాధాకరమన్నారు. మహిళలపై నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే..**

నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలి.



బాధిత కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా అందించాలి.
నిరుద్యోగిగా ఉన్న త్రిష సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.
కుటుంబానికి 5 ఎకరాల సాగుభూమి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.
ఆదివాసి విద్యార్థులకు గురుకులాల్లో 75 శాతం సీట్లు కల్పించాలి.
అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో స్థానిక ఆదివాసులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
ఆదివాసి యువతులకు హాస్టల్ వసతి, 24 గంటల భద్రత కల్పించాలి.
మహిళలపై నేరాల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి, 100 రోజుల్లోగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. పాదయాత్ర బుధవారం సాయంత్రం కొమ్ముగూడెం చేరుకోనుందని నాయకులు తెలిపారు. గురువారం ఉదయం ములకలపల్లి నుంచి చౌటిగూడెం వరకు భారీ మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆదివాసి సమాజం ఐక్యంగా నిలిచి ఊకే శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆలెం కోటి , జిల్లా అధ్యక్షులు సనప కోటేశ్వరరావు జిల్లా ఉపాధ్యక్షులు బాడిస మోహన్ రావు, డివిజన్ అధ్యక్షులు పాయం లక్ష్మీనరసు విద్యార్థి సంఘం నాయకులు జిల్లాగౌతం తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న గురువుల సేవలకు గుర్తింపు**

**చర్ల: సెప్టెంబర్ 9 భద్రాద్రి న్యూస్**
విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల మండల స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అక్షర జ్ఞానం నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించే వరకు ప్రతి విద్యార్థి విజయ ప్రయాణంలో గురువుల కృషి ఎంతో ఉంటుందన్నారు. సమాజ అభివృద్ధికి, నైతిక విలువల పెంపొందింపునకు ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న 30 మందికి పైగా ఉపాధ్యాయులను ఎంపిక చేసి పురస్కారాలతో సత్కరించారు. తమ సేవలను గుర్తించి సన్మానించడం పట్ల ఉత్తమ ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రెజొనెన్స్ శ్రీనివాస నగర్ స్కూల్‌లో ఘనంగా కౌశిక జయంతి వేడుకలు

**విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా ప్రత్యేక కార్యక్రమాలు**

**“జై కౌశిక – జై తెలుగు – జై తెలంగాణ” నినాదాలతో మార్మోగిన ప్రాంగణం**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):**
ఖమ్మంలోని శ్రీనివాస నగర్ రెజొనెన్స్ స్కూల్‌లో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.దకార్యక్రమాన్ని ఉద్దేశించి స్కూల్ కరస్పాండెంట్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. కాళోజీ తన రచనల ద్వారా ప్రజల సమస్యలను, సామాజిక అంశాలను ప్రపంచానికి చాటారని అన్నారు. ఆయన ఆశయాలను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్కూల్ డైరెక్టర్ ఆర్. నీలిమ మాట్లాడుతూ.. కాళోజీకి తెలుగు భాష, తెలంగాణ యాస, సంస్కృతిపై ఎంతో అభిమానం ఉండేదని తెలిపారు. విద్యార్థులు తమ మాతృభాషను ప్రేమిస్తూ, సంస్కృతిని గౌరవించాలని సూచించారు. కాళోజీ జీవితం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని కాళోజీ నారాయణరావుకు నివాళులు అర్పించారు. అనంతరం “జై కాళోజీ – జై తెలుగు – జై తెలంగాణ” నినాదాలతో కార్యక్రమాన్ని ముగించారు.

# విద్వేషం, విధ్వంస విధానాలతో కాంగ్రెస్ పాలన

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):–**



విద్వేషం, విధ్వంస విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చర్చ జరగకుండా వారి దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ నేతలు తాజా రాజకీయాలకు తెరలేపి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని ఆ అసంతృప్తి, వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి మళ్లించే రాజకీయాలకు పాల్పడుతోందని అన్నారు. ప్రజల సమస్యలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలపై సమాధానం చెప్పకుండా ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు.

# రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ వి.డి.వో.స్ కాలనీ

**క్యాంపస్లో తెలంగాణా తెలుగు భాషాదినోత్సవ వేడుకలు**




**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):–**
సెప్టెంబర్ 9వ తేదిన కాళోజి నారాయణ రావు జయంతిని తెలంగాణ రాష్ట్ర తెలుగు భాషా దినోత్సవం జరుపుకొను సందర్భంగా రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ వీ. డివోస్ కాలని క్యాంప్స్ లో ముఖ్యఅతిథి డి.పీ.ఆర్.ఒ గౌస్ , ప్రొపిసర్ సీతారామ్ , ప్రముఖ రచయిత గాయకులు ఆర్.ఉపేందర్ , పాఠశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ , కొండా శ్రీధర్ రావు పాల్గోని ప్రజాకవి కాళోజి నారాయణ చిత్రపటానికి పూల మాల వేసి నివాళు అర్పిస్తూ ఆ మహకవి తెలంగాణ భాషా అబివృద్ధికి చేసిన కృషిని కొని యాడుతూ డి.పి.ఆర్.ఓ గౌస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తెలంగాణ యాస, బాషలను కాపాడుకోవాలని కోరారు .మరో ముఖ్య అతిథి ప్రోపెసర్ సీతారామ్ , కాళోజీ నారాయణ జీవితం లక్ష్యం సమాజనిర్మాణం కొరకు చేసిన సేవ ముఖ్యంగా సమాజ నిర్మాణం కొరకు చేసిన సేవ మరి ముఖ్యంగా తెలంగాణ సాధన కొరకు సాహిత్యం ద్వారా చేసిన కృషిని కొనియాడారు. డైరెక్టర్ శ్రీధర్ రావు మాట్లాడుతూ... తెలంగాణ భాషా ప్రాచీన మని మన జీవన విదానంలో భాషా అంతర్భాగమని మనం మాట్లాడే భాషా విలువలను కాపాడుతుందని తెలియజేసారు ఈ కార్యక్రమంలో పాల్గోన్న ప్రతి ఒక్కరికి తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు.

భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 10, సెప్టెంబర్, 2026

# శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శతాధిక కవిసమ్మేళనం



**భద్రాచలం, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):-**
సెప్టెంబర్ 20 వ తేది ఆదివారం రోజు స్ధానిక స్ధానిక పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాల లో 176 వ శతాధిక కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధి వరలక్ష్మి సాయిరాం తెలిపారు. బుధవారం భద్రాచలం పట్టణం లో జరిగిన శ్రీశ్రీ కళావేదిక సన్నాహక కమిటీ సమావేశం లో ఆమె మాట్లాడారు.శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం లో దేశ వ్యాప్తంగా 200పైగా కవులు పాల్గొననున్నారని పేర్కొన్నారు.అంతర్జాతీయ సీఈఓ డా. కత్తిమశీడ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరిభూషణం, ఫ్లానింగ్ అధికారి డా. పార్ధసారధి నేత్రుత్వం లో ఈ కవిసమ్మేళనం అత్యంత వైభవం గా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కవి సమ్మేళనం లో పాల్గొనే కవులను శాలువా,పూలదండలతో ఘనంగా సత్కరించి, మెమెంటో ఇవ్వడం తో పాటు అక్షర కిరీటి బిరుదు ను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. కవి సమ్మేళనం లో పాల్గొనే వారు 9182613680,9346078988 వాట్సాప్ ద్వారా సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి సి. జకర్య, శ్రీశ్రీ కళావేదిక తెలంగాణా రాష్ట్ర సమన్వయ కర్త సురేష్ బాబు, తోటమళ్ళ, జిల్లా అధ్యక్షులు జి. లక్ష్మణ్ కుమార్, జిల్లా ప్రతినిధి ఎర్రంశెట్టి పూర్ణిమ లు పాల్గొన్నారు.

# ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే అరుదైన గుండె చికిత్స

### మినిమల్లీ ఇన్వాసివ్ 'మిట్రాక్లిప్'తో 60 ఏళ్ల హైరిస్క్ పేషెంట్‌కు విజయవంతమైన చికిత్స

### మూడు వారాలు వెంటిలేటర్‌పై ఉన్న రోగికి నాలుగు రోజుల్లో డిశ్చార్జి




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):**
గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో అత్యంత విషమ పరిస్థితిలో ఉన్న 60 ఏళ్ల రోగికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే మినిమల్లీ ఇన్వాసివ్ మిట్రాక్లిప్ ప్రొసీజర్ నిర్వహించి విజయవంతంగా చికిత్స అందించినట్లు యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ కార్డియాలజీ బృందం వెల్లడించింది.

ఖమ్మంలోని యశోద మెడికల్ సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ కార్డియాలజీ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కళా జితేందర్ జైన్ వివరాలు వెల్లడించారు. సదరు రోగి దాదాపు మూడు వారాలుగా వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్నారని, తీవ్రమైన లిమిట్రల్ రిగర్గిటేషన్ (వీ=)లితో పాటు ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు.

మిట్రల్ వాల్వ్ సక్రమంగా మూసుకోకపోవడంతో రక్తం వెనక్కి ప్రవహించి గుండెపై తీవ్ర ఒత్తిడి ఏర్పడటం వల్ల రోగికి పదేపదే హార్ట్ ఫెయిల్యూర్ సమస్య ఎదురైందని చెప్పారు. రోగి పరిస్థితి, ఊపిరితిత్తుల సమస్యలు, అధిక శస్త్రచికిత్స ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఓపెన్ హార్ట్ సర్జరీకి బదులుగా మినిమల్లీ ఇన్వాసివ్ మిట్రాక్లిప్ విధానాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు.

డాక్టర్ కళా జితేందర్ జైన్ నేతృత్వంలోని కార్డియాలజీ బృందం, సీనియర్ కన్సల్టెంట్ (క్లినికల్ అండ్ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ) డాక్టర్ వి. నాగార్జున మాటూరు, క్రిటికల్ కేర్ బృందంతో సమన్వయం చేసుకుంటూ ఈ క్లిష్టమైన చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స అనంతరం రోగి గుండె పరిస్థితిలో గణనీయమైన మెరుగుదల కనిపించిందని, ప్రొసీజర్ జరిగిన నాలుగు రోజులకే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ జితేందర్ జైన్ తెలిపారు. అధిక ప్రమాదం ఉన్న రోగులకు పెద్ద శస్త్రచికిత్సకు ప్రత్యామ్నాయంగా మిట్రాక్లిప్ వంటి మినిమల్లీ ఇన్వాసివ్ విధానాలు ఉపయోగపడతాయని అన్నారు.

కార్డియాక్, పల్మనరీ, క్రిటికల్ కేర్ విభాగాల సమన్వయంతో అత్యంత సంక్లిష్టమైన హైరిస్క్ గుండె కేసులకు మెరుగైన చికిత్స అందించగల సామర్థ్యానికి ఈ విజయమే నిదర్శనమని తెలిపారు.

ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో ప్రతి నెల 2వ, 4వ బుధవారాల్లో తాను అందుబాటులో ఉంటానని డాక్టర్ కళా జితేందర్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్లు డి. బాలరాజు, డి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై 'మరణ' వ్యాఖ్యలు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే తీరుపై బీఆర్‌ఎస్ భగ్గు

### హాని చేయడానికి ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణ

### ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

### కేసీఆర్ భద్రతను తక్షణమే సమీక్షించాలని కోరిన ఖమ్మం బీఆర్‌ఎస్ నేతలు



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):-**
బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయని బీఆర్‌ఎస్ ఖమ్మం నాయకులు అన్నారు. కేసీఆర్ మరణాన్ని కోరేలా, ఆయనకు హాని కలిగించే విధంగా ప్రేరేపించే ధోరణిలో వ్యాఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డారు. సెప్టెంబర్ 8న ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా, ఆర్ టి వి లో ప్రసారం ద్వారా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థిపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, హింసకు దారితీసేలా వ్యాఖ్యలు చేయడం మాత్రం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం మౌనం వహించకూడదని బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఒక ప్రజాప్రతినిధి చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో ఉద్రిక్తతలకు, అనుచరుల మధ్య ఘర్షణలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఎమ్మెల్యే శంకరయ్య చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై సమగ్ర దర్యాప్తు జరిపి, భారతీయ న్యాయ సంహితలోని నిబంధనల మేరకు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వ్యాఖ్యల వెనుక ఉద్దేశం ఏమిటి, వాటి వల్ల ఎలాంటి పరిణామాలకు అవకాశం ఉందన్న అంశాలపైనా దర్యాప్తు చేయాలని కోరారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రోత్సహించినా, సహకరించినా వారి పాత్రను కూడా విచారించాలని అన్నారు. ఈ వ్యాఖ్యల నిపథ్యంలో కేసీఆర్ భద్రతను ప్రభుత్వం తక్షణమే సమీక్షించాలని బీఆర్‌ఎస్ ఖమ్మం నాయకులు డిమాండ్ చేశారు. ఆయనకు ఎలాంటి హాని జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకు ఒక పరిమితి ఉండాలని, ఆ పరిమితి దాటితే ప్రభుత్వం చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్, మాజీ కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దండ జ్యోతి రెడ్డి అయ్యప్ప రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, దేవభక్తుని కిషోర్ బాబు, కొనకంచి ప్రసాద్, కోలేటి రాధాకృష్ణ, జాబిశెట్టి శ్రీనివాసరావు, చిలకల వెంకట నరసయ్య, పొదిలి నాగరాజు, యాకూబ్ పాషా, మారగాని సుదర్శన్, వంగవీటి శ్రీనివాసరావు, చల్లగుండ్ల నరసింహారావు,తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ శాఖ నిర్లక్ష్యంతో పెరుగుతున్న భూ వివాదాలు

### పోలీస్-రెవిన్యూ శాఖల మధ్య సమన్వయ లోపంతో సమస్యలు ముదురుతున్నాయని ఆరోపణ

### 'ప్రాణాలు పోయేంత వరకు స్పందించరా?' అంటూ ఆవేదన వ్యక్తం చేసిన బానోత్ మంగమ్మ



**చుంచుపల్లి, సెప్టెంబర్ 9 ( భద్రాద్రి న్యూస్ )**
భూ వివాదాల పరిష్కారంలో రెవిన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పోలీస్--రెవిన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్యలు మరింత జటిలమవుతున్నాయని బానోత్ మంగమ్మ ఆరోపించారు. తనకు సంబంధించిన భూమి విషయంలో కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు సకాలంలో స్పందించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమికి సంబంధించిన హక్కులపై కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని, పోలీస్ రక్షణ కూడా పొందినప్పటికీ వేధింపులు కొనసాగుతున్నాయని మంగమ్మ పేర్కొన్నారు. తనపై దాడులు చేసి, తిరిగి తనపైనే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. తాను ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదని వాపోయారు. భూముల విషయంలో వివాదాలు తలెత్తినప్పుడు రెవిన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితులను స్పష్టం చేయాల్సి ఉన్నప్పటికీ, తమ సమస్యను సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరించకపోవడంతో వివాదాలు తీవ్రరూపం దాల్చుతున్నాయని ఆమె అన్నారు. మరోవైపు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ రెవిన్యూ రికార్డులు, భూ హక్కుల అంశాలపై స్పష్టత లేకపోవడం సమస్య పరిష్కారానికి ఆటంకంగా మారుతోందని పేర్కొన్నారు. "ప్రాణాలు పోయేంత వరకు అధికారులు స్పందించరా? ముందే సమస్యను పరిష్కరించి మాకు రక్షణ కల్పించాలి. భూమి కోసం ప్రతిరోజూ భయంతో జీవించాల్సి వస్తోంది" అని బానోత్ మంగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. చుంచుపల్లి మండలం 27/2ఆ, 128/2ఆ, 128/3అ సర్వే పరిధిలోని తన స్థలం హద్దులను పోలీస్ అధికారుల సమక్షంలో సర్వే చేసి లొకేషన్ స్కెచ్ తయారు చేసి తమ భూమి కబ్జా అవ్వకుండా కాపాడాలని ఆమె విన్నవించారు. భూ వివాదాలపై సంబంధిత రెవిన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, తనకు రక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలని ఆమె కోరారు.

# సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి.



**భద్రాద్రి న్యూస్ ములుగు**
సెప్టెంబర్ 17న నిర్వహించే ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి అధికారులను ఆదేశించారు. బుధవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో మొదటిసారిగా నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేదిక, ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి అవసరమైన తాగునీటి సౌకర్యంతోపాటు ఇతర మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



**రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్.**

**భద్రాద్రి న్యూస్ ములుగు**

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27వ తేదీన జిల్లాలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ అన్నారు. బుధవారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఆకర్షణీయమైన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొందించి, జిల్లాలో పర్యాటక ప్రదేశాల ప్రచారం, అభివృద్ధి కోసం ఆసక్తి కలిగిన యువతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. యువ టూరిజం క్లబ్ ల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమాలను ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలలో నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 142 పర్యాటక ప్రాంతాలను గుర్తించిన నేపథ్యంలో, ఆయా ప్రాంతాలలో సందర్శకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజలలోకి తీసుకు వెళ్లేందుకు వినూత్న ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో పాటు



ఫిల్మ్ టూరిజం ద్వారా పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించాలని తెలిపారు. జ్ఞాన భారత్ కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని, ఇందు కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, జిల్లాలోని వివిధ ప్రాంతాలు, దేవాలయాలు, మఠాలు, గ్రంథాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి సమగ్ర జాబితా రూపొందించాలని తెలిపారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను డిజిటలైజ్ చేసి, కేంద్రీకృత సేకరణ లోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రదేశాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, వాటికి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, పర్యాటక ప్రాంతాలను ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా టూరిజం నోడల్ ఆఫీసర్ డాక్టర్ ధర్మ నాయక్, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, డి ఐ ఓ వీరేందర్, డి పి ఆర్ ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కాన్ పోటీల్లో సర్వజ్ఞ విద్యార్థుల ఘన విజయం

## సాంస్కృతిక, సృజనాత్మక పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

## విజేతలకు చైర్మన్ ఆర్.వి. నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమ అభినందనలు




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 9 (భద్రాద్రి న్యూస్):**

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక, సృజనాత్మక పోటీల్లో సర్వజ్ఞ ది న్యూ జెన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక విలువలు, సృజనాత్మకత, భాషా నైపుణ్యాలు, కళాత్మక ప్రతిభను పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించిన కలరింగ్, శ్లోక మెమొరైజేషన్, వ్యాసరచన, కథ చెప్పడం, వక్తృత్వం, క్రాఫ్ట్, పాట్ కలరింగ్ పోటీల్లో సర్వజ్ఞ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించారు.

గ్రూప్-ఏ విజేతలు

కలరింగ్: మోన్విక్ (III-C), రియా (II-A), రుషిక సాయి (II-C)

శ్లోక మెమొరైజేషన్: ధన్విక (II)

వ్యాసరచన: కె. ప్రణవ్ (VII-C), జి. అన్విక (VI-C), ఏ. గగన ప్రథిక్ష (VII-S)

స్టోరీ టెల్లింగ్: వేదవల్లి (II)

క్రాఫ్ట్: రితిక (V-A)

పాట్ కలరింగ్: కె. వృందా కృష్ణమయి (VI), పి. వెరోనికా (VI), ఎన్. వేగా (VI)

గ్రూప్--బి విజేతలు

కలరింగ్: కె. గీతాంశ (IV-A), ఎన్. గగన్ (VI-C), టి. దిత్య సాయి సామన్వి (IV-C)

వ్యాసరచన: పి. సహస్ (VIII-C)

స్టోరీ టెల్లింగ్: కె. వృందా కృష్ణమయి (VI)

వక్తృత్వం: గీతా నందన్ (IX-S)

క్రాఫ్ట్: బి. లహరిత (X), జి. హిత శ్రీ, ఆర్. బృహతి ఆరాధ్య

పాట్ కలరింగ్: ఛ. నిగిత (IX), పి. హారిక (VIII)

ఈ సందర్భంగా విజేతలందరికీ సర్వజ్ఞ విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వి. నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా వారు అభినందించారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**గతేడాదితో పోలిస్తే రెట్టింపు స్థాయిలో ఏర్పాట్లు చేయా**

**మున్నేరు వద్ద నీటి లభ్యత లేనందున పరిస్థితులకు అనుగుణంగా నిమజ్జన ప్రాంతాలను ఎంపిక చేయాలి**

**నిమజ్జన రూట్‌మ్యాప్, ట్రాఫిక్ డైవర్షన్ వివరాలను ముందుగానే ప్రకటించాలి**

**గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో, ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్- 09 ( భద్రాద్రి న్యూస్):-**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక విగ్రహాల నిమజ్జనం ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సంబంధిత అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో నిమజ్జన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఘనంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రెట్టింపు స్థాయిలో ఏర్పాట్లు, ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తక్కువగా ఉందని, గతేడాది ఖమ్మం నగర పరిధిలోనే 1,000కు పైగా వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగిన నేపథ్యంలో ఈ ఏడాది నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. మున్నేరు బ్రిడ్జి వద్ద ప్రస్తుతం అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో లేనందున నిమజ్జనంకు భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని అనువైన ప్రాంతంలో ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు, పోలీస్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను, సమాచారాన్ని ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీలు, అధికారులు సమన్వయంతో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమాచారం ప్రతి ఒక్కరికీ ముందుగానే చేరేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఏటా జరిగే కార్యక్రమమేననే కారణంతో నిర్లక్ష్యం చేయకుండా, పరిస్థితులకు అనుగుణంగా మరింత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ రాకపోకలు సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అన్నారు.

**రూట్‌మ్యాప్, ట్రాఫిక్ డైవర్షన్‌పై ముందస్తు ప్రచారం:**

వినాయక విగ్రహాల నిమజ్జనానికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేసి ప్రజలకు, ఉత్సవ కమిటీలకు తెలియజేయాలని కలెక్టర్ అన్నారు. ట్రాఫిక్ డైవర్షన్ అడ్వైజరీని సెప్టెంబర్ 20వ తేదీ సాయంత్రానికల్లా విడుదల చేయాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిమజ్జన పాయింట్లపై తుది నిర్ణయం తీసుకోవాలని, నిమజ్జనం సందర్భంగా ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన సంఖ్యలో ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రూట్ మార్గాలకు అనుగుణంగా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ఇంటర్నెట్, టీవీ కేబుల్స్ తదితర వాటిని అవసరమైన చోట్ల సర్దుబాటు చేసి, విగ్రహాల తరలింపునకు ఎలాంటి ఆటంకం లేకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిమజ్జన రూట్‌లో రహదారి మరమ్మతు పనులు ఉంటే వెంటనే చేపట్టి పూర్తిచేయాలని, నిమజ్జన పాయింట్లకు అప్రోచ్ రోడ్లు సక్రమంగా ఉండేలా చూడాలని అన్నారు.

**విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు:**

గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గణేష్ మండపానికి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లైన్‌మ్యాన్ ద్వారా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు స్వయంగా అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకొని ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ తీగల వల్ల ఎలాంటి విద్యుత్ షాక్ ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గణేష్ మండపాల్లో షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని అన్నారు.

**నిమజ్జన పాయింట్ల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు:**

జిల్లాలోని ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద అవసరమైన బ్యారికేడ్లు, క్రేన్లు, విద్యుత్ సరఫరా, త్రాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విగ్రహాల తరలింపు సమయంలో అడ్డుగా వచ్చే చెట్ల కొమ్మలను ముందుగానే తొలగించాలని, జిల్లాలో ఎత్తైన విగ్రహాల తరలింపును ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే సమన్వయం



చేసుకుని వారికి షిఫ్టుల వివరాలు తెలియజేయాలని అన్నారు.

**వైద్య, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి:**

ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని, మందులు తదితర అత్యవసర వైద్య సామగ్రిని సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రతను పర్యవేక్షించాలని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండపంలో చేపట్టిన ఏర్పాట్లు, అవసరమైన భద్రతా చర్యల వివరాలను ముందుగానే తెలుసు కోవాలని సూచించారు. ప్రతి గణేష్ మండపం వద్ద పోలీస్, ఫైర్, విద్యుత్, హెల్త్ తదితర అత్యవసర సేవల అధికారుల సంప్రదింపు వివరాలతో కూడిన చిన్న పోస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎక్కడా మద్యం విక్రయాలకు అనుమతి ఇవ్వకూడదని, మద్య నిషేధాన్ని కట్టు దిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ దోవలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.



# పేదల ఆకలిని తీర్చే ఆరాధ్యుడు ఇక లేడు

**షార్ట్ సర్క్యూట్ తో మృతి చెందిన లింగాల కేదారి**

**50 రూపాయల భోజనంతో నగర ప్రజలకు సుపరిచితుడు**



హనుమకొండ అదాలత్ జంక్షన్ వద్ద గల లింగాల కేదారి హోటల్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి హోటల్ యజమాని లింగాల కేదారి మృతి చెందారు ఈ విషయం నగరవాసులకు దిగ్భ్రాంతిని కలిగించింది .

బుధవారం రోజు సాయంత్రం రోజువారి పనిలో భాగంగా పిండిని రుబ్బుతున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో భార్యాభర్తలు ఇద్దరూ కాలిన గాయాలతో కేదారి ఉన్న వారిని పోలీస్ సిబ్బంది ఎంజీఎం తరలించగా కేదారి మృతి చెందినట్లుగా నిర్ధారించారు ఆయన భార్య 80 శాతం గాయాలతో చికిత్స పొందుతున్నారు . నగరంలో 50 రూపాయల భోజనంతో మారుమూల ప్రాంతాల నుండి కోర్టుకి, హనుమకొండకు వివిధ పనుల పై వచ్చే వారికి తక్కువ ధరకు భోజనాన్ని ఏర్పాటు చేసి ఎంతో పేరు సాధించారు తెలంగాణ ఉద్యమ కాలంలో ఉద్యమకారులకు భోజనాన్ని అందించి తన మంచి మనసును చాటుకున్నారు ఈరోజు షార్ట్ సర్క్యూట్ టౌన్ మృతి చెందడం నగర ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఈ షార్ట్ సర్క్యూట్ కు గల కారణాలు తెలియాల్సి ఉంది విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారుదు

# బాలికల వసతి గృహాల్లో సమస్యలపై రిజిస్ట్రార్ పరిశీలన



**ఎడ్యుకేషన్ కేయు సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :**

కాకతీయ విశ్వవిద్యాలయ బాలికల వసతి గృహాల్లో నెలకొన్న వివిధ సమస్యలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం బుధవారం సాయంత్రం సమీక్షించారు. వసతి గృహాల్లో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుధ్యం, నిర్వహణ, విద్యుత్, ప్లంబింగ్ తదితర అంశాలను ఆయన పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తన కార్యాలయంలో వసతి గృహాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, వివిధ వసతి గృహాల జాయింట్ డైరెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో పనిచేస్తున్న సిబ్బంది, వెయిటర్లు, మహిళా అటెండెంట్లు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ తదితర సిబ్బంది విధుల నిర్వహణపై సమీక్షించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి గృహాల్లోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో తక్షణమే పరిష్కరించాలని రిజిస్ట్రార్ ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని, ఇదే విధమైన నిర్లక్ష్య ధోరణి కొనసాగితే క్రమశిక్షణా చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థినులకు మెరుగైన వసతి, సౌకర్యాలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

# బ్లడ్ డొనేషన్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరించిన విష్ణు వర్ధన్ రెడ్డి




అంజుమన్-ఏ- హైదర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అతిపెద్ద బ్లడ్ డొనేషన్ క్యాంప్ యొక్క పోస్టర్ ని రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి అల్లుడు శ్రీ విష్ణు వర్ధన్ రెడ్డి గారు బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం అనేది చాలా గొప్ప విషయం అని క్యాన్సర్ మరియు తలసేమియా వ్యాధి గ్రస్తులకు ఇది చాలా ఉపయోగపడుతుందని 11.09.2026 న నిర్వహించే ఈ రక్తదాన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు, రక్తదానం చేయడం వల్ల ఒకరికి ప్రాణ దానం చేసినవారిమౌతామని ఆయన అన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులైన అంజుమన్-ఏ-హైదర్ వెల్ఫేర్ సొసైటీ వారిని అభినందించారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ తాజా వివరాలు రాజకీయ పార్టీలకు వెల్లడించాలి





**పోలింగ్ కేంద్రాల వారీగా దావాలు, అభ్యంతరాల జాబితాల అందజేత.**

**: జిల్లా ఎన్నికల అధికారి,**

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**భద్రాద్రి న్యూస్ ములుగు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026కు సంబంధించిన తాజా వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు వెల్లడించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని మినీ సమావేశ మందిరంలో 109--ములుగు ఎస్టీ శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చేపడుతున్న ప్రతి అంశాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ షెడ్యూల్‌ను అక్టోబర్ 19 నుంచి నవంబర్ 9 వరకు పొడిగించిన నేపథ్యంలో, సవరించిన షెడ్యూల్ ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు అందిన దావాలు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారాలు--9, 10, 11 జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా అందిన దావాలు, అభ్యంతరాలు, ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, వాటి ప్రస్తుత స్థితికి సంబంధించిన వివరాలను సమావేశంలో వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని 308 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఏవైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ కృష్ణవేణి, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పశు ఘోష పట్టించుకునేది ఎవరు?





**చర్ల మండలంలో జోరుగా అక్రమ పశువుల రవాణా?**

**నిబంధనలకు తూట్లు పొడుస్తున్న పశువుల వ్యాపారులు?**

**అధికారుల హెచ్చరికలు బేఖాతర్.. పట్టపగలే దందా సాగుతున్నదా?**

**చర్లను అడ్డాగా చేసుకుని మూగజీవాల అక్రమ రవాణా?**

**అధికారుల పర్యవేక్షణ ఏది?**

**చర్ల: సెప్టెంబర్ 9 భద్రాద్రి న్యూస్**

మూగజీవాల రక్షణకు నిబంధనలు ఉన్నా.. వాటి అమలు మాత్రం కాగితాలకే పరిమితమవుతున్నాయా? భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోందన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. అనుమతులు, రవాణా నిబంధనలు, పశువుల సంక్షేమానికి సంబంధించిన మార్గదర్శకాలను పట్టించుకోకుండా కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా పశువులను తరలిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పశువులను తరలించే వాహనాలపై నిబంధనల ప్రకారం తనిఖీలు జరగాల్సి ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆ నిఘా కనిపించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో "నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిని అడ్డుకునేది ఎవరు? అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేది ఎవరు?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## హెచ్చరికలు ఎక్కడ? చర్యలు ఎక్కడ?

అక్రమ పశువుల రవాణాపై అధికారులు పలుమార్లు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, ఆ హెచ్చరికలకు భయపడకుండా కొందరు వ్యాపారులు తమ దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల నిఘా కొరవడితే అక్రమ రవాణాదారులకు మరింత స్వేచ్ఛ లభించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలపై దయ చూపాల్సిన వ్యవస్థ.. అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు.. ఎక్కడ చూసినా మౌనం ఎందుకు? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్లలో చర్చనీయాంశంగా మారాయి.

## చర్ల కేంద్రంగా 'మూగజీవాల మాఫియా' సాగుతోందా?

చర్ల మండల కేంద్రంగా పశువుల అక్రమ రవాణాకు కొందరు వ్యక్తులు తెరతీస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. రవాణా మార్గాలు, వాహనాల అనుమతులు, పశువుల సంఖ్య, వాటి తరలింపు ఉద్దేశం తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ రవాణా నిజమే అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు అవాస్తవమైతే అధికారులే స్పష్టత ఇవ్వాలి. లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు మరింత బలపడే అవకాశం ఉంది. మూగజీవాల కేకలు వినిపిస్తున్నాయా.. లేక అధికారుల చెవులకు ఆ శబ్దం చేరడం లేదా? చర్లలో పశువుల రవాణాపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిగ్గుతేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

